# నవ్వవు జంతువుల్

**ఆ**మని పెళ్ళికి, చుట్టాలు ఓ రోజు ముందుగానే విచ్చేసారు! చాలామంది షామియానాలో వున్న కుర్చీలలో కూర్చుని, ఉదయమే కాఫీ సేవిస్తున్నారు.

అప్పుడే వస్తూన్న కామేశం మావయ్యని చూసి, "అదిగో మన కామేశం మామయ్య కూడా వచ్చేశాడు!" అన్నాడు ఒక మేనల్లుడు.

"ఏం మావయ్యా రైల్లో అందరూ కులాసాయేనా!" అన్నాడు మరో మేనల్లుడు ఉదయ్.

"అదేమిట్రా! నేను నువ్వూ కలుసుకొని రెండేళ్ళయింది. "నువ్ కులాసాయేనా మావయ్యా! అనడం మానేసి, రైల్లో అందరూ కులాసా!" అని అడుగుతున్నావ్.

"మనం ఎప్పుడూ కులాసాగేనే వుంటాం, మావయ్యా! మన చుట్టూ ఉన్న వాళ్ళ సంగతి విచారించాలి కదా!"

"ఎందుకురా విచారించడం!"

"ఏం లేదు నువ్ ఎం.ఎ. తెలుగు సాహిత్యం కదా, పద్యాలు పాడి ఉతికావేమోనని!"

"బాగుంది! లోపలికి వెళ్ళి మంచి స్ట్రాంగ్ కాఫీ పట్టుకురా! స్నానం అయిన తర్వాత నీకొక మంచి పద్యం చెపుతాను."

"అలాగేకాని, టిఫిన్ తిన్న తర్వాత అయితే కొంచెం బలంగా ఉంటుంది, అపుడు చెప్పు నీ పద్యమేమిటో! అన్నాడు ఉదయ్.

"అవునుగాని నేను వచ్చి అప్పుడే అరగంటయింది. పి.పి. సిస్టర్స్ కనకపడలేదు! ఇంకా వాళ్ళు రాలేదా! వాళ్ళని చూస్తే, ఒకేసారి రెండు చంద్రబింబాలు చూసినట్లుంది నాకు" అన్నాడు కామేశం మావయ్య.

"ఇంకో గంటలో వచ్చేస్తార్లే!". అక్కడే కూర్చున్న ఒక దూరపు చుట్టం "పి.పి. సిస్టర్స్ ఏమిటండి, చాలా గమ్మత్తుగా వుంది! నాకెవరైనా "సిస్టర్స్" అంటే సంగీతంలో ఆరితేరిన "ప్రియా సిస్టర్స్" "బాంబే సిస్టర్స్" జ్ఞాపకం వస్తారు. ఈ పి.పి. సిస్టర్స్ కూడా సంగీత కచేరీ లేమైనా చేస్తూంటారా!"

"అదేం లేదండీ! వీళ్ళది పువ్వులపాలెం! ఇద్దరూ కవల పిల్లలు, ఒకేలా ఉంటారు! వీళ్ళని చూస్తే ఎవరెవరో తెలుసుకోలేం. చాలా అందమైన వాళ్ళు. పెద్దదాని పేరు "అచ్చీ" రెండవదాని పేరు "బుచ్చి" అన్నాడు కామేశం. అస్తమానం పువ్వులపాలెం సిస్టర్స్ అనలేక పి.పి. సిస్టర్స్ అంటూంటాం!" అన్నాడు కామేశం.

"చాలా అందంగా ఉంటారంటున్నారు , మరి "అచ్చీ, బుచ్చీ" అంటూ ఆ పేర్లేమిటండీ!

"ఏం లేదూ వీళ్ళపైన పుట్టిన పిల్లలు నలుగురు పోయారు. ఒక పండితుడ్ని ఈ కవల పిల్లలు చిరాయువులుగా ఉండే పేర్లేమయినా పెట్టించండి" అంటే రెండక్షరాలు గల పేర్లు, అదికూడా వత్తు "చి" వచ్చేవి పెడితే, అందరూ "ఛీ! ఛీ" అనుకుంటారు. నరుడి కంట నల్లరాయి బద్దలవుతుందంటారు! దృష్టి దోషం తగలకుండా నలుగురూ ఛీ ఛీ అనుకుంటే, సమస్త పీడలు నశిస్తాయి! తద్వారా వీళ్ళు దీర్ఘాయుష్మంతులు అవుతారు అన్నాడు, అందుకని ఈపేర్లు పెట్టారు!"

"అయితే చాలామంది ఈ పిల్లల్ని "ఛీ ఛీ" అంటున్నారా!"

"పైకి అనటం లేదుకాని, లోపలనుకుంటారు కదా" అన్నాడు కామేశం.

ఇంతలో "పి పి సిస్టర్స్" రానే వచ్చారు! "హలో! పి.పి. సిస్టర్స్ ఎలా ఉన్నారు!" అన్నాడు, కామేశం.

"నేను కూడా వీళ్ళని "ఛీ ఛీ సిస్టర్స్" అనాలని ఉందండి!" అన్నాడు అప్పటి వరకూ పూర్వగాథ వినిన ఆ దూరపు చుట్టం.

"పైకి అనక్కర్లేదు! లోపలనుకుంటే చాలయ్యా బాబూ!" అన్నాడు కామేశం.

ఇంతలో, "ఓ! కామేశం మామయ్యా! బాగున్నావా" అన్నారు, పి.పి. సిస్టర్స్!

"బాగున్నాను కాని, మీ మీ మొగుళ్ళు అంటే మీ రెస్పెక్టివ్ హజ్బెండ్స్ రాలేదేం!".

"నా మొగుడు సాయంకాలానికి క్యాంప్ నుంచి తిన్నగా యిక్కడికే వస్తారు! బుచ్చి మొగుడు అమెరికా ప్రాజెక్టు పనిమీద వెళ్ళాడు."

"అవునే అచ్చీ! అడిగానని ఏమనుకోకు! నీ మొగుడేమయినా సన్నపడ్డాడా ఇంకా గుమ్మడి పండులాగానే ఉన్నాడా!"

"నాతో వేళాకోలాలెందుకు మావయ్యా! వచ్చిన తర్వాత చూద్దుగానిలే!" అంది అచ్చి.

---

అచ్చి మొగుడు సాయంకాలానికి వచ్చాడు. అందరూ "అచ్చి మొగుడొచ్చాడు" అన్నారు.

కామేశం అతన్ని చూసి ఆశ్చర్యపోయాడు! పెళ్ళిలో శుభ్రంగా ఉండేవాడు, ఇప్పుడు ఈనుపుల్లలా అయిపోయాడు. పాపం కష్టపడి. ప్రయాణం చేసొచ్చాడు, తర్వాత పలకరిద్దామని ఊరుకున్నాడు కామేశం.

ఉదయ్‌ని అడిగాడు "ఆ అచ్చి మొగుడేమిట్రా అలా అయిపోయాడు సన్నగా!"

"నాకేం తెలుసు మావయ్యా బ్రహ్మచారిని".

"పిచ్చిగా పిచ్చిగా మాట్లాడకు నేనడిగిన ప్రశ్నకి పెళ్ళయిన వాళ్ళే సమాధానం చెప్పగలరంటావా! అన్నాడు, కామేశం.

"అదేమిటి మావయ్యా ఏదో సరదాకి అంటే నీకంత కోపమొచ్చింది! మా అందరికీ నువ్వొక్కడివే మేనమామవి! నీకు కోపమొస్తే ఎలా బ్రతగలం చెప్పు!"

"సరే ఆపేయ్! అచ్చి మొగుడు యిటే వస్తున్నాడు."

"అచ్చి మొగుడ్ని చూసి, "రండి! ఈ కుర్చీలో కూర్చోండి, మీ పేరు శ్యామ్ సుందర్ కదూ! నన్ను గుర్తుపట్టారా. నేను కామేశాన్ని, మీ భార్య మేనమావని!"

ప్రత్యేకంగా తన పేరు కూడా చెపుతూంటే తెలీదనడం మర్యాద కాదని, "అయ్యో మీరు తెలుసండి, మీరు మా పెళ్ళికి వచ్చారు కదా!" అన్నాడు శ్యామ్‌సుందర్.

"ఏం బావగారూ కులాసానా!" అన్నాడు ఉదయ్. ఓ అరగంట గడిచింది. కామేశం, ఉదయ్ తెగ మాట్లాడుతున్నారు కాని శ్యామ్‌సుందర్ మాత్రం మౌనంగా ఉండిపోయాడు.

"ఉదయ్! నీకొక జోక్ చెపుతాను! ఒకడు నేనెక్కువ మాట్లాడను అన్నాడట. రెండోవాడు "నాకు కూడా పెళ్ళయింది" అన్నాడట!".

అక్కడ కూర్చున్నవాళ్ళంతా నవ్వారు కాని, శ్యామ్‌సుందర్ మాత్రం నవ్వలేదు.

"ఆ! మావయ్య నీవేదో మంచి పద్యం చెపుతాను అన్నావు ఏమిటా ఆపద్యం!" అన్నాడు ఉదయ్.

నవ్వవు జంతువుల్, నరుడు నవ్వును,
నవ్వుల్ చిత్త వృత్తికిన్ దివ్వెలు, కొన్ని
నువ్వు లెటు తేలవు, కొన్ని విషప్రయుక్తముల్....."

అంటూ, జాషువా రాసిన పద్యం చదివాడు కామేశం.

ఇందాకా కామేశం చెప్పిన జోక్‌కి నవ్వలేదని, "నవ్వవు జంతువుల్" అనే పద్యం చెప్పి తనల్ని కించపరిచాడన్న, బాధతో శ్యామ్‌సుందర్‌కి కళ్ళలో నీళ్లు తిరిగాయ్. ఇది గమనించిన కామేశం, "మిస్టర్ శ్యామ్!" అంటూ, అతన్ని పక్కకి తీసికెళ్ళి, "ఏదో సరదాగా ఆ పద్యం చెప్పాను. మీరెందుకు అంత సీరియస్ అయిపోయి మనస్సు బాధ పెట్టుకుంటున్నారు!" అన్నాడు.

"ఏం లేదు సార్! మీరు అచ్చికి మేనమావ, అంటే నాకు తండ్రి లాంటి వారు. పైగా మీరు చాలా మంచివారని చాలామంది నాకు చెప్పారు. మీకు నా వైవాహిక

జీవితానికి సంబంధించిన కొన్ని విషయాలు చెపుతాను! దయచేసి ఎవరికీ చెప్పకండి. పెళ్ళవకముందు, నేను కూడా ఎప్పుడూ ఉల్లాసంగా నవ్వుతూ ఉండేవాడిని! నా పెళ్ళయిన తర్వాత జరిగిన కొన్ని సంఘటనల వలన నవ్వడం మానుకున్నాను."

"అసలు నవ్వడం మానుకోవలసినంత అగత్యం ఏం వచ్చింది!"

"ఏముంది నవ్వకుండా ఉండి, జంతువుని అనిపించు కోవడానికి!"

"శ్యామ్ పొట్టలో ఓ చిన్న పోటు పొడిచి, అసలు విషయం చెపుదురూ!" అన్నాడు కామేశం.

"నా భార్య కవల పిల్లల్లో ఒకర్తె! కవలలు యిద్దరూ ఒకేలా ఉంటారని మీకు తెలుసుకదా! వీళ్ళిద్దరిలో ఎవరు ఎవరో తెలుసుకోవడం కష్టం. పెళ్ళయిన కొత్తలోనే కాదు, యిప్పుడు కూడా వీళ్లద్దరి మధ్యా తేడా తెలుసుకోలేక తబ్బిబ్బవు తూంటాను నేను. పెళ్ళయిన కొత్తలో మా మరదల్ని చూసి, నాభార్య అనుకుని రెండు మూడు సార్లు నవ్వాను. ఆ పిచ్చి బుచ్చి "బావ అస్తమానం నన్ను చూసి నవ్వుతున్నాడని" మా అత్తగారితో చెప్పిందట!"

మా అత్తగారు నా భార్యని పక్కకి పిలిచి, "నీ మొగుడు వట్టి జులాయిలా ఉన్నాడే, బుచ్చిని చూసి నవ్వవలసిన అగత్యమేమొచ్చింది అతనికి అందిట"

"నా భార్య నన్ను తిట్టిన తిట్టు తిట్టకుండా తిట్టి ,"ఈసారి దాన్ని చూసి నవ్వారో మీ నవ్విన మూతిమీద ఫట్‌మని కొడతానంది!" అప్పట్నుంచీ ఆడాళ్ళనీ, మొగాళ్ళనీ బేధం లేకుండా ఎవర్ని చూసినా నవ్వడం మానేశాను."

పెళ్ళయిన కొత్తలో మొదటి సంక్రాంతి పండగకి, అత్తారింటికి వెళ్ళినప్పుడు, మళ్ళీ ఓ లొల్లి జరిగింది. అక్క చెల్లెళ్ళు యిద్దరూ ఒకేలా ఉండటం కాకుండా, ఇద్దరూ ఒకేరకం చీరలు కట్టుకుని నాలాంటి అమాయకుల ప్రాణం తీస్తారు. పెద్ద పండగనాడు యిద్దరూ "సరిలేరు మాకెవ్వరూ" అన్నట్లు, ఒకే రకం పట్టు చీరలు కట్టుకున్నారు! పైగా యిద్దరూ సిగలో మల్లెపూలు పెట్టుకున్నారు. మా ఆవిడ అనుకుని "బుచ్చి" చీర కొంగులాగుతూ, "అబ్బో! మల్లెపూలు ఘుమఘుమ లాడి పోతున్నాయ్!" అన్నాను. మళ్ళీ మా అత్తగారు పరోక్షంగా రంగ ప్రవేశం చేసింది! విషయం మా ఆవిడ చెవిన పడింది! మా ఆవిడ నన్ను గట్టిగా తగులుకుంది. "నవ్వద్దంటే, నవ్వడం మానేసి, ఏకంగా కొంగు లాగటం మొదలెట్టారన్నమాట! పుట్టింట్లో సిగ్గుతో చచ్చిపోతున్నాను! నన్ను తిన్నగా బ్రతక నివ్వరనుకుంటాను" అని రభస చేసింది. ఆ తర్వాత మళ్ళీ అత్తారింటికి వెళ్ళలేదు సరికదా, మా ఆవిడ కొంగు జోలికి కూడా పోలేదు. మా పెళ్ళయిన ఆర్నెల్లకే బుచ్చి పెళ్ళి కూడా అయిపోయింది. ఇద్దరి మెడలలో కూడా మంగళ సూత్రాలు ఉండడం

వలన తేడా తెలిసేది కాదు. కొంగులాగిన విషయం మా అమ్మగారికి కూడా తెలిసింది.

"వెర్రి వెధవా జాగ్రత్తగా ఉండు! మీ ఆవిడకి కోపం వచ్చి, ఏ విడాకులైనా యిచ్చేస్తే, బోల్డు ఆస్తి పోతుంది! వాళ్ళకి యిద్దరే ఆడపిల్లలు కదా ఉన్న ఆస్తంతా ఆ యిద్దరిదేకదా, నీకు సగం వస్తుందని, ఈ సంబంధం చేశాం. గొడవలయితే ఈ పెళ్ళి వలన జరగవలసిన ప్రయోజనం పోతుంది" అన్నారు.

"అబ్బ! ఎంత బాధపడుతున్నావయ్యా! విధి, ఓ కవల పిల్లల రూపాల్లో బాధపెడుతుందన్న విషయం, జీవితంలో మొదటిసారి వింటున్నాను" అన్నాడు, కామేశం.

"అసలు సుఖం లేని ఆస్తి ఎంత సంప్రాప్తిస్తే ఏమి ఉపయోగం బాబయ్యగారూ."

ఎప్పుడైనా మా మరదలు "బుచ్చి" మా యింటికి వస్తే, కావాలని ఆఫీస్ పని ఉందని చెప్పి, క్యాంప్‌కి వెళ్ళిపోయేవాడిని.

"అసలీ పెళ్ళిలో ఏం గొడవ జరుగుతుందోనని భయంగా ఉంది. అందుకనే, ఇందాకా మీరు చెప్పిన జోక్‌కి కూడా నవ్వలేదు! మళ్ళీ నవ్వడం మొదలెడితే, అలవాటయి గొడవలు అవుతాయని భయం. బాబయ్యగారూ!"

"ఆస్తి కలసి వస్తుందన్న ఆశతో ఈ కవల పిల్లని చేసుకోవడం వలన జీవితంలో నవ్వే అవకాశం పూర్తిగా పోయింది! పైగా నన్ను జంతువులలో జమకట్టేశారు, బాబయ్యగారూ, మీరు".

"సారీ! సరదాగా చదివిన పద్యం! అంతేకాని నిన్ను కించ పరచడానికి కాదయ్యా! నడు పందిట్లోకి వెళదాం".

"ఏమిటి మావయ్యా! మా ఆయనని వేసుకు తిరుగుతున్నావ్!" అంది అచ్చి.

"ఊరికే అలా ఓ రౌండ్ వెసొచ్చాం!" " జాగ్రత్త మామయ్యా! వట్టి తింగరి మనిషి, ఆయనతో ఎక్కువ తిరగకు."

---

(ఆంధ్రభూమి వారపత్రిక 20-12-2012)